తెలుగు కళాసమితి(న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో 100/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# ఆర్గ్యుమెంట్

బండారు లక్ష్మి



చలిగాలి మంచితనంలా వంటిని చల్లబరుస్తోంది. పల్చటి ఎండ ఆత్మ విశ్వాసంలా వెచ్చదనాన్నిస్తోంది. రెండిటికీ స్వంత దారులా నిదారుగా నడుస్తున్న నందిని ప్రక్కన మారుతీకారు ఆగడం చూసి- ఆగింది.

"చాలా రోజులక్కని పించావు నందినీ- యింటి కెళ్దాంరా. మా ఆవిణ్ణీ- పిల్లల్నీ చూద్దువుగాని."

అన్నాడు- విజయకుమార్ డోర్ తెరచి.

నందిని కారు తాలూకు దర్జాకో- విజయ కుమార్ మీద అభిమానానికో- మారుమాట్లాడ కుండా- కారులో ఎక్కి కూర్చుంది.

నందిని దృష్టికి ప్రక్కన కూర్చున్న విజయ కుమార్‌కి బదులుగా పెద్దాపురప్పాడు హైస్కూల్లోని పదేళ్ళ కుమార్—

మధ్యాహ్నం భోజనాల టైములో- ఎవర్నో కుర్రాణ్ణి క్రిందపడేసి- వాడి మీద కూర్చొని పీక నులిమేస్తుంటే- నందిని చూసి పరిగెత్తికెళ్ళి రెండు పిడిగుద్దులు పడేసింది. కుమార్ ఆ కుర్రాణ్ణి వదిలేసి లేచి నిలబడ్డాడు.

"బుద్ధిలేదూ! మీ అమ్మతో చెప్తానుండు- అన్నీ రౌడీ వేషాలు." అంటూ బెదిరించింది. చల్లబడి పోయాడు కుమార్. పదవ తరగతి క్లాస్‌లో లాంగ్ బెల్ కొట్టాక పిల్లలంతా జనగణమణ పాడుతుంటే-శాంత పైట కొంగుకు- స్టిక్కర్ లాంటిది అంటించాడు కుమార్.

ప్రార్థన అయ్యేవరకూ వూరుకొని ఆపు చేసింది నందిని.

"బుద్ధి లేదూ- ఒక క్లాసులో పిల్లలం-

బయట పిల్లలు ఏవన్నా అంటే తిట్టవలసిందిపోయి- నువ్వే యిలా చేస్తావా!" గదమాయించింది నందిని. కుమార్ నోరెత్తలేదు.

వయసులో యించుమించు సమానమయినా- తన మీద పెద్ద రికం చెలాయించే నందినికి- ఒకసారి తన గొప్పతనం చూపించాలనిపించింది కుమార్‌కి.

"విజయకుమార్ ప్యాలసా." అంది నందిని భవనం వైపు చూస్తూ.

కుమార్ భార్య గీత- మీరజాలగలడా నా గీతను- అన్నట్టు ఠీవిగా వుంది. కనుబొమ ల దగ్గర్నుంచీ- జీరాడే కుచ్చిళ్ళ వరకూ అందంగా- చిత్రకారుడి గీతల్లా ఖచ్చితంగా వుంచింది. కూతురూ- కొడుకూ- యిల్లంతా మమ్మీ, డాడీ సంస్కృతిని పండిస్తూ బంతుల్లా ఎగురు తున్నారు.

గీత నందినికి యిల్లంతా చూపించింది. గోడలకి తైలవర్ణ చిత్రాలూ, మూలలకి ఖరీదైన శిల్పాలూ- నేలంతా తివాచీలూ- పై కప్పంతా కనకాంబరాలూ- యిల్లు సంపదలకు ఎగ్జిబిషన్‌లా వుంది.

అందరితోనూ కూర్చుని కాఫీ తాగి- "బావుంది కుమార్- చాలా సాధించావ్." అంది సంతృప్తిగా.

కుమార్ కళ్ళు ఆనందంగా మెరిసాయి. నాలుగు రోజుల తరువాత జరిగే తన కూతురి పుట్టిన రోజుకి మరీ మరీ రమ్మని ఆహ్వానిస్తున్న గీతకు సరేనని చెప్పి- వచ్చేసింది.

డ్రైవర్ కారులో దిగబెట్టి వెళ్లిపోయాడు.

కారులోనించి దిగడంచూసి- పక్కింటి చంద్రరావ్- క్రరకాలు ఆనించుకుంటూ వచ్చి-

"మా అయ్యగారు మీకు తెలుసేటమ్మా?" అన్నాడు.

"ఏ అయ్యగారూ!" ఆశ్చర్యంగా అడిగింది నందిని.

"ఆరేనమ్మా విజయకుమార్ బాబుగారు. ఆరి ఫేక్టరీలోనే గదా నేను పని చేసే వోణ్ణి- ఇంజన్లో పడి కాలిరిగిపోతే- పాతికి వేలు నష్ట పరిహారం యియ్యమంటే- నేను తాగి వాళ్ల తెలీక యింజన్లో పడ్డానని- మాఫీ చేయించి- ఐదు వేలు చేతుల్లో ఎట్టేడు మా బాబు! పోన్లేమ్మా- ఆళ్ళనే పెద్దోళ్ళయి పోనియ్. రెండు చేతుల్తోనూ తిన్నియ్." నిష్టురంగా అన్నాడు.

చంద్రరావు యింటి దగ్గరే బడ్డీ కొట్టు నడుపుకొంటున్నాడు పొట్టకోసం. నందినికి అయ్యో పాపం అనిపించింది.

మర్నాడు సాయంత్రం నందిని పెద్దాపురప్పాడు వెళ్లింది- తమ్ముడి భార్యకు కూతురు పుట్టిందని. ఉయ్యాల్లో వెయ్యడం అవీ అయ్యాక- మేనల్లుడు మమ్మీ ఆంటీ అంటుంటె విజయ కుమార్ గుర్తొచ్చాడు.

"శంకరమ్మగారు ఎక్కడున్నారు?" అడిగింది తమ్ముణ్ణి.

"ఎక్కడేంటీ- పాతయింట్లోనే- నడు- వెళ్దాం-" అంటూ లేవదీసేడు.

శంకరమ్మగారు- పండిన బంగినపల్లి మామిడి పండులా అరుగుమీద కూర్చొని ఒత్తులు చేసుకుంటోంది. నలుగురు పిల్లలు చుట్టూ చేరి చదువుకుంటున్నారు.

నందినిని చూసి- "రామ్మా- కూర్చో చాలా రోజులకి కనబడ్డావ్." అంది సంబరపడుతూ.

"యిల్లంతా అద్దెకిచ్చేసేరా!" అంది నందిని కాసేపయ్యాక.

"ఆ చాకిరీ చెయ్యలేక- సందడిగా వుంటారని యిచ్చేసేను."

"ఈ పిల్లలు- " అనుమానంగా అడిగింది.

"ఆ- కాలక్షేపం- కాసేపు చదువుకొని వెళ్తారు" అంది శంకరమ్మగారు.

ఆవిడ చెప్పకపోయినా నందినికి విషయం అర్థమయింది.

"మీ అబ్బాయిని చూసి వచ్చాను " అని చెప్పాలని పించలేదు. కాసేపు కష్టం సుఖం మాట్లాడి వచ్చేసింది.

పుట్టిన రోజునాడు వుదయాన్నే పిలుపు వచ్చింది.

సాయంత్రం దీపాలు పెట్టే వేళకు- వెళ్ళింది నందిని.

గీత మిగిలిపోయిన అతిథులను సాగనంపుతోంది.

"ఏంటీ తెచ్చావ్" అంటూదగ్గరకూర్చొని- చనువుగా పేకెట్ అందుకొని విప్పేడు విజయ కుమార్.

"పెద్దాపురప్పాడు వెళ్ళి నిన్ననే వచ్చాను. కృష్ణక్కూతురు పుట్టింది. శంకరమ్మగార్ని కూడా చూసే వచ్చేను. క్షేమంగానే వున్నారు." అంది నందిని.

అట్టపెట్టె లోనించి బయటికి తీసేడు- అందమైన గాజు కూజా. చక్కటి పువ్వులు- ఆకులు- లతలతో చూడముచ్చటగా వుంది.

"వెరీనైస్." అన్నాడు. అంటూనే- "అరే దీనికి అడుగు లేదే-" అంటూ అనుమానంగా చూసేడు నందిని వైపు. నందిని సోఫాలో వెనక్కివాలి సీలింగ్ వైపు చూస్తూ నెమ్మదిగా అంది-

"అది అందానికే కుమార్- ఎవరికీ వుపయోగపడ్డానికి కాదు." ●

## ఫోటో వ్యాఖ్య ఫలితాలు

ఈ పోటీ నిమిత్తం 2-5-86 సంచికలో మేము ప్రచురించిన ఫోటో ఇంతకుముందే మరొక సమకాలీన దినపత్రికలో ఫోటోవ్యాఖ్య పోటీగా ప్రచురింపబడిందని మాకు తెలిసింది. ఈ విషయమై మాకు ఫోటో పంపిన శ్రీ కేతా నాగేశ్వరరావు (సిద్ధాంతం) సంజాయిషీ కోరగా వారికి ఒకే ఫోటోను రెండు పత్రికలకు పంపకూడదని తెలియకపోవడం వల్ల ఇలా జరిగిందని క్షమాపణలు చెప్పుకున్నారు. ఈ తతంగం వల్ల ఫలితాల ప్రచురణ ఆలస్యమైందని పాఠకులు గమనించగలరు.

ఈ పోటీలో శ్రీ గంటేడ గౌరునాయుడు పంపిన వ్యాఖ్యను ఉత్తమమైనదిగా ఎంపికచేసి రు. 15 బహుమతిగా పంపిస్తున్నాము. మరొక చక్కని వ్యాఖ్యను పంపిన శ్రీ టి. శ్రీనివాసరావుకు రు. 10 ప్రోత్సాహక బహుమతిగా అందచేస్తున్నాము.

—ఎడిటర్

### బహుమతి పొందిన వ్యాఖ్యలు

1. అమ్మీ ఎందుకీ సొది!
ఈ అణుయుగంలో
ఉందా మనకు రేపనేది?!

—గంటేడ గౌరునాయుడు,
దళాయిపేట (విజయనగరం జిల్లా)

2. ఎరుకల సానిది ఎనలేని చాతుర్యం!
ఎరుగగలేనిది కొనలేని భవితవ్యం!!

—టి. శ్రీనివాసరావు,
హైదరాబాద్